www.udyamakeratam.com
PRGI No. : TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 98 | 24-9-2026 | గురువారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

## ఎన్నికల సంఘంలో 'విభేదాల' దుమారం

- పది నెలల్లో 14 సార్లు ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలంటూ కథనం
- ఓటర్ల జాబితా, ఫారం-6 మార్పులు, సమాచార కేంద్రీకరణపై ప్రశ్నలు
- అవి అభిప్రాయాలు మాత్రమే.. తుది నిర్ణయాలపై విభేదాలు లేవన్న ఈసీ

4




## ఈసీపై కాంగ్రెస్ అగ్రనేతల ఘాటు దాడి

- అక్రమాలకు ఈసీ సహకరిస్తే అది తీవ్రమైన 'దేశద్రోహ చర్య'
- ప్రియాంక, రాహుల్ గాంధీ
- ఓటు చోరీపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

4



దేశంలో ఎన్నికల నిష్పాక్షికత, పారదర్శకతపై రాజకీయ రచ్చ పీక్ స్టేజీకి చేరింది. కేంద్ర ఎన్నికల సంఘంలో అంతర్గత అ భ్యంతరాలు, విభేదాలు ఉన్నాయంటూ ఓ ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ప్రచురించిన కథనం ఆధారంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.



## రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి
# గ్లోబల్ సమ్మిట్

### తెలంగాణ ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చేలా ఏర్పాట్లు

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో మహాసదస్సు
- దేశ, విదేశాల్లో రోడ్‌షోలు.. రోజువారీ పర్యవేక్షణకు వార్‌రూమ్
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రానికి భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన ధ్యేయంగా 2026 డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' ఏర్పాట్లను అత్యంత వేగవంతంగా, పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ భవిష్యత్తును, ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే ఈ చరిత్రాత్మక ఘట్టంలో అధికార యంత్రాంగమంతా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ భవిష్యత్తు, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే చరిత్రాత్మక ఘట్టంగా ఈ సదస్సును తీర్చిదిద్దాలని సూచించారు. సదస్సు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనుంది. సచివాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సు ఏర్పాట్లు, ప్రచారం, దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు, పెట్టుబడిదారుల భాగస్వామ్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. మిగతా 2 లో



## దసరాలోపు యాదాద్రి
# ఫుల్ పవర్

- పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి
- బొగ్గు కొరతతో ఉత్పత్తిపై ప్రభావం.. ప్రత్యామ్నాయాలపై దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై సమీక్ష

2



## రైతు కన్నీటిలో ఓట్లు
# వెతకడమా?

- కరవుపై బీఆర్ఎస్ నీచ రాజకీయం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆగ్రహం
- నీటి కోసం కర్ణాటక సీఎంతో మంతనాలు.. సానుకూల స్పందన
- పంటలను కాపాడతాం.. వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం
- నేరేడుచర్లలో 26.93 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

2

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న వేళ వారికి ధైర్యం చెప్పాల్సింది పోయి, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ బీఆర్ఎస్ నేతలు పైశాచికానందం పొందుతున్నారని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదని మండిపడ్డారు. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్లతో నిర్మించిన నేరేడుచర్ల-దూపాడు డబుల్ రోడ్డుతో పాటు, రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామ పంచాయతీ భవనం, రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఎల్‌నినో అనేది అంతర్జాతీయ స్థాయిలో వాతావరణంలో వచ్చే శాస్త్రీయ మార్పని, దీనివల్ల ఈసారి వర్షపాతం 40 శాతం తగ్గిందని వివరించారు.



## ఉద్యోగులకు
# ఊరట

- రెండు డీఏల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం
- త్వరలోనే పీఆర్సీ నివేదిక.. సీపీఎస్ రద్దుపై అధ్యయన కమిటీ ఏర్పాటు
- ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

2

## రిమ్స్ ఘటనలో
# ఐదుకు చేరిన మృతుల సంఖ్య

బాధిత కుటుంబాలకు రూ.6.50 లక్షల ఆర్థికసాయం

- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం
- ప్రతిపక్షాల నుంచి మరో రూ.1.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటన
- ఘటనపై మానవ హక్కుల కమిషన్ సుమోటో కేసు స్వీకరణ

2

## కాంగ్రెస్ వచ్చింది..
# కరెంట్ పోయింది

- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నాసిరకం బొగ్గుతో రూ.2,900 కోట్ల నష్టం..
- 80ల నాటి విద్యుత్ కష్టాలు పునరావృతం
- థర్మల్ ప్లాంట్ల పరిశీలనకు బీఆర్ఎస్ తరఫున ఆరు ప్రత్యేక బృందాలు

3






## ఎన్నికలకు ఇప్పటి నుంచే
# రెడీ కావాలి

- క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి
- పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- బీజేపీ శ్రేణులకు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దిశానిర్దేశం

3

## డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే
# ప్రారంభం కావాలి

- తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు..
- సమాజమంతా కలిసి ఉద్యమించాలి

3





## మా భూముల హద్దులు
# నిర్ధారించాలి

3

- కలెక్టర్ కార్యాలయంలో రైతుల వినతిపత్రం
- కలకలం రేపుతోన్న ఎర్రవల్లి భూ సర్వే వివాదం

పాస్ పుస్తకాలు ఉన్న తమ భూములకు హద్దులు నిర్ధారించి న్యాయం చేయాలని కోరుతూ ఎంఆర్‌వో కార్యాలయం వద్ద వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు నిరసన తెలిపారు.



# రిమ్స్ ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య

**బాధిత కుటుంబాలకు రూ.6.50 లక్షల ఆర్థికసాయం**

**సీఎం ఆదేశాలతో ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం**

**ప్రతిపక్షాల నుంచి మరో రూ.1.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటన**

**ఘటనపై మానవ హక్కుల కమిషన్ సుమోటో కేసు స్వీకరణ**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆసుపత్రిలోని స్పెషల్ న్యూ నియోనేటల్ కేర్ యూనిట్ (ఎస్ఎన్సీయూ)లో ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడి సంభవించిన అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. అక్కడ చికిత్స పొందుతున్న 27 మంది పసికందుల్లో ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, బుధవారం మరో ఇద్దరు శిశువులు మృత్యువాత పడ్డారు. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం మల్లెగూడకు చెందిన దుర్గాబాయి కూతురు, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దుబ్బగూడకు చెందిన నాగుబాయి కూతురు మరణించిన వారిలో ఉన్నారు. మిగిలిన చిన్నారుల్లో నలుగురిని క్షేమంగా తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లగా, ఇతరులకు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. అలాగే, చికిత్స పొందుతున్న పిల్లలకు మెరుగైన వైద్యం కోసం అవసరమైతే హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. త్వరలోనే రిమ్స్‌లో 150 పడకలతో అత్యాధునిక మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**బాధిత కుటుంబాలకు విపక్షాల భరోసా.. హెచ్ఆర్సీ తీవ్ర ఆగ్రహం:**

రిమ్స్ ప్రమాద స్థలాన్ని అధికార, ప్రతిపక్ష నేతలు పరిశీలించారు. బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వ హత్యేనని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ తరపున మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత రిమ్స్‌ను సందర్శించి, తమ పార్టీ తరపున రూ.50 వేల పరిహారం ఇస్తామన్నారు. దీనితో ప్రభుత్వ సాయంతో కలిపి ఒక్కో బాధిత కుటుంబానికి మొత్తం రూ.6.50 లక్షల ఆర్థిక సాయం అందనుంది. మరోవైపు ఈ విషాద ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందిస్తూ సుమోటోగా కేసు నమోదు చేసింది. ఆసుపత్రి ప్రమాదం, చిన్నారుల మృతిపై ఈ నెల 27వ తేదీలోగా సమగ్ర విచారణ నివేదికను సమర్పించాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి హెచ్ఆర్సీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి 'గ్లోబల్ సమ్మిట్'

మొదటి పేజీ తరువాయి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణకు దాదాపు పది ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో కమిటీకి సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని చెప్పారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారుల కమిటీలతోపాటు సంబంధిత మంత్రుల నేతృత్వంలో కార్యనిర్వాహక మండళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కమిటీల కన్వీనర్లు వెంటనే మంత్రులతో సమావేశమై బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు అవకాశమున్న రంగాలతోపాటు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దేశాలు, నగరాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించాలని భట్టి ఆదేశించారు. ఏ దేశంలో ఏ రంగానికి పెట్టుబడి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయో అధ్యయనం చేసి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆ ప్రణాళికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించిన అనంతరం రోడ్‌షోలను ప్రారంభించాలని చెప్పారు. గతంలో కుదిరిన అవగాహన ఒప్పందాలను కూడా సమీక్షించి వాటి అమలు ఎంతవరకు వచ్చిందో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఇప్పటికే వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలను కార్యరూపంలోకి తీసుకురావడంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లన్నింటినీ ప్రత్యేక వార్‌రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని భట్టి సూచించారు. అధికారులు తమ బృందాలతో సమావేశమై రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ప్రతి సాయంత్రం పనుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. గత నెలలో నిర్వహించిన సమీక్షలోనూ సదస్సుకు సంబంధించిన నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సదస్సును ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు పత్రికలు, టెలివిజన్, డిజిటల్, సామాజిక మాధ్యమ వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని భట్టి సూచించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. సదస్సుకు సంబంధించిన కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలు నిరంతరం ప్రచారంలో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో ఈ గ్లోబల్ సమ్మిట్ కీలక మైలురాయిగా నిలవాలని భట్టి పేర్కొన్నారు. సదస్సు ఏర్పాట్లను కేవలం మూడు రోజుల కార్యక్రమంగా కాకుండా రాష్ట్రానికి దీర్ఘకాలంలో ఉపయోగపడే పెట్టుబడుల వేదికగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.



**తెలంగాణ సంస్కృతి ఉట్టిపడాలి: శ్రీధర్‌బాబు**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను పెట్టుబడుల సమీకరణకే పరిమితం చేయకుండా తెలంగాణ సంప్రదాయాలు, సాంస్కృతిక విశిష్టతను ప్రపంచానికి చాటే వేదికగా తీర్చిదిద్దాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. బతుకమ్మ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రత్యేక వంటకాలు అతిథులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ సాంస్కృతిక వైభవం గుర్తుండిపోయేలా కార్యక్రమాలు రూపొందించాలని చెప్పారు. సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో రాష్ట్ర కళలు, వారసత్వం, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# దసరాలోపు యాదాద్రి ఫుల్ పవర్

- పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి
- బొగ్గు కొరతతో ఉత్పత్తిపై ప్రభావం.. ప్రత్యామ్నాయాలపై దృష్టి
- మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు ఆదేశం
- కేంద్ర బొగ్గు గనుల శాఖతో తక్షణమే సంప్రదింపులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని దసరాలోపు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా యాదాద్రి కేంద్రంలో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని స్పష్టం చేసింది. ఇందుకు అవసరమైన బొగ్గు సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి సారించాలని సూచించింది. ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో పనిచేయకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీ-9 గ్రేడ్ బొగ్గు లభ్యత, ప్రస్తుతం జరుగుతున్న బొగ్గు సరఫరా, దానివల్ల రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారం, సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాకుల పరిస్థితిపై ప్రధానంగా చర్చించారు. యాదాద్రి విద్యుత్ కేంద్రానికి అవసరమైన నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సమకూర్చడంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. బొగ్గు లభ్యతలో ఎదురవుతున్న సమస్యలు, రవాణా వ్యయం, సరఫరా కారణంగా రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని అధికారులు వివరించారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి అవసరమైన బొగ్గు కొనుగోలుకు వెంటనే చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అనుమతులు, కేటాయింపులు, సరఫరా అంశాలపై కేంద్ర బొగ్గు గనుల శాఖతో తక్షణమే సంప్రదింపులు జరపాలని సూచించారు. సింగరేణి నుంచి అందుబాటులో ఉన్న బొగ్గు, ఇతర సంస్థల నుంచి సమకూర్చుకునే అవకాశాలను సమగ్రంగా పరిశీలించి యాదాద్రి విద్యుత్ కేంద్రానికి నిరంతరాయంగా బొగ్గు అందేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా దసరాలోపు అన్ని చర్యలు పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. బొగ్గు సరఫరా నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు ఎదురవుతున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి అన్ని యూనిట్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైన బొగ్గు నిల్వలు ఉండేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# రైతు కన్నీటిలో ఓట్లు వెతకడమా?


**కరవుపై బీఆర్ఎస్ నీచ రాజకీయం**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆగ్రహం**

**నీటి కోసం కర్ణాటక సీఎంతో మంతనాలు.. సానుకూల స్పందన**

**పంటలను కాపాడతాం.. వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం**

**నేరేడుచర్లలో రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం**



**నేరేడుచర్ల, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రధాన ప్రతిపక్షం కరవు రావాలని, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ పైశాచికానందం పొందేందుకు ప్రయత్నిస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రకృతి కారణంగా ఏర్పడిన వర్షపాత లోటును కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ ఆ పార్టీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని దుయ్యబట్టారు. రైతుల కష్టాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చుకోవడం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష లక్షణం కాదని మండిపడ్డారు. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్లతో నిర్మించిన నేరేడుచర్ల-దూపాడు డబుల్ రోడ్డును మంత్రి ఉత్తమ్ బుధవారం ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామ పంచాయతీ భవనం, రూ.33 లక్షలతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో అనేది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే శాస్త్రీయ పరిణామం.. భారత రుతుపవనాలపైనా దాని ప్రభావం పడుతుంది.. ఈసారి వర్షపాతం దాదాపు 40 శాతం తగ్గింది.. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వంపై విషప్రచారం చేయడం బీఆర్ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం అని విమర్శించారు. పొలంలో పంట ఎండిపోతే ప్రభుత్వానికి బాధ కలుగుతుంది.. బీఆర్ఎస్‌కు మాత్రం రాజకీయ అవకాశం కనిపిస్తోంది. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదు అంటూ విరుచుకుపడ్డారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కనూ కాపాడి ప్రజల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పంటలను కాపాడడం, రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోందన్నారు. సమస్య వచ్చినప్పుడు పరిష్కారాన్ని వెతికేది కాంగ్రెస్ ప్రభుత్వం.. సమస్య మరింత పెరగాలని కోరుకునేది బీఆర్ఎస్.. తాము రైతు పంటను కాపాడేందుకు నీళ్ల కోసం రాష్ట్రాల తలుపులు తడుతున్నాం అని చెప్పారు. జూరాల ఆయకట్టు కింద పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో మంతనాలు జరిపినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తనకున్న వ్యక్తిగత స్నేహాన్ని రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం వినియోగించానని చెప్పారు. రాష్ట్ర విజ్ఞప్తికి డీకే సానుకూలంగా స్పందించారని, నీటి లభ్యతను పరిశీలించి సహకరించేందుకు హామీ ఇచ్చారని వివరించారు. 'మేం కర్ణాటకతో మాట్లాడి నీళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.. బీఆర్ఎస్ నేతలు మాత్రం రైతుల్లో భయం సృష్టిస్తున్నారు.. మాకు రాజకీయాల కంటే పంటలు ముఖ్యం.. ప్రచారం కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం' అని మంత్రి స్పష్టం చేశారు. ప్రకృతిని శాసించలేము.. కానీ ప్రజలను కాపాడే బాధ్యత నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి వెళ్లం' అని ప్రకటించారు. ప్రజల అవసరాలకనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంతో తనకు ఉన్నది రాజకీయ సంబంధమే కాదు.. ప్రజలతో పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధం.. మీ శ్రమ, ప్రేమ, ఆదరాభిమానాలతోనే ఆరుసార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు ఎన్నికయ్యాను.. మీ రుణాన్ని అభివృద్ధితోనే తీర్చుకుంటా' అని చెప్పారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే వెన్నెముక అని మంత్రి అన్నారు. వారి కృషి, ప్రజల విశ్వాసంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతం కావడం ఈ ప్రాంత యువతపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. రోడ్లు, భవనాలు నిర్మించడం అభివృద్ధిలో ఒక భాగం.. కానీ ఒక యువకుడికి ఉద్యోగం వచ్చి అతని కుటుంబంలో వెలుగు నిండితే అంతకంటే గొప్ప సంతృప్తి మరొకటి ఉండదు.. కోదాడ మెగా జాబ్ మేళా విజయం ప్రజల ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో నిరూపించింది అని ఉత్తమ్ అన్నారు. ప్రజా సంక్షేమం, రైతుల రక్షణ, యువతకు ఉపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ అవాస్తవ ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు ఊరట

- రెండు డీఏల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం
- త్వరలోనే పీఆర్సీ నివేదిక.. సీపీఎస్ రద్దుపై అధ్యయన కమిటీ ఏర్పాటు
- ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలోని సర్కారు ఉద్యోగులకు రెండు కరువు భత్యాలు (డీఏ) మంజూరు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా అంగీకారం తెలిపింది. సచివాలయంలో బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జరిపిన చర్చల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ సమావేశంలో ఉద్యోగుల పెండింగ్ డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం ముగిసిన అనంతరం ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తమ సంఘం తరపున మూడు డీఏలు విడుదల చేయాలని ప్రతిపాదించగా, ప్రభుత్వం రెండు డీఏల చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వెల్లడించారు. ఇందులో 3.46 శాతంతో మొదటి డీఏను, 2.74 శాతంతో రెండో డీఏను ఇచ్చేందుకు అంగీకరించారని వివరించారు. ఇక మిగిలిన మూడో డీఏను రాబోయే 3 నుంచి 4నెలల వ్యవధిలో విడుదల చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

**ఈ నెలాఖరు నాటికి పీఆర్సీ నివేదిక**

ఈ నెలాఖరు నాటికి పీఆర్సీ కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందే అవకాశం ఉందని సీఎస్ సంజయ్ జాజు తమకు తెలియజేశారని జేఏసీ నాయకులు వెల్లడించారు. నివేదిక అందిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని సీఎస్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పీఆర్సీ కమిషన్ గడువును మళ్లీ పొడిగించకుండా నిర్దేశిత సమయంలోనే నివేదిక తీసుకునేలా చూడాలని ఉద్యోగ సంఘాలు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశాయి.

**సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణపై కమిటీ**

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే అంశంపై అధ్యయనం చేసేందుకు ఉద్యోగ సంఘాల నాయకులు మరియు ఉన్నతాధికారులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి పెన్షన్ విధానాలను అధ్యయనం చేసిన అనంతరం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభం కావాలి

- తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు..
- సమాజమంతా కలిసి ఉద్యమించాలి
- విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ, విద్యాసంస్థల ప్రవేశాల్లో డిక్లరేషన్ తప్పనిసరి
- వ్యసన బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించి ప్రజా ఉద్యమంగా మార్చాలి



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను, విద్యార్థులను కాపాడటం కేవలం ప్రభుత్వం, పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం కలిసికట్టుగా చేపట్టి నడిపించాల్సిన సామాజిక ఉద్యమమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటం ప్రతి ఇంటా ప్రారంభమై, విద్యాసంస్థలలో బలపడి, యువత భాగస్వామ్యంతో ప్రజా ఉద్యమంగా రూపాంతరం చెందాలని ఆకాంక్షించారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి 'నశా ముక్త్ భారత్ అభియాన్'ను రాష్ట్రంలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఆయన హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, హనుమకొండ, వరంగల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో పర్యటించి విద్యార్థులు, యువతలో ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, విద్యాసంస్థలలో కొత్తగా చేరే సమయంలోనే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామనే ముందస్తు డిక్లరేషన్ తీసుకోవాలని స్పష్టమైన సూచనలు చేశారు.

### 'నశా ముక్త్ యువ' కార్యక్రమాలు మిషన్ మోడ్‌లో అమలు

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు (విసిలు)తో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. 'నశా ముక్త్ యువ' కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు 'మై భారత్' పోర్టల్ ద్వారా యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞలో భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్ వ్యసనానికి గురైన వారిని కేవలం నేరస్థులుగా పరిగణించకుండా, వారికి తగిన కౌన్సెలింగ్, వైద్య సహాయం, పునరావాసం కల్పించి సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు. యువత తమ అపారమైన శక్తిసామర్థ్యాలను చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, నూతన ఆవిష్కరణల వైపు మళ్లించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా హితవు పలికారు.

# కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది

- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నాసిరకం బొగ్గుతో 2,900 కోట్ల నష్టం..
- 80ల నాటి విద్యుత్ కష్టాలు పునరావృతం
- థర్మల్ ప్లాంట్ల పరిశీలనకు బీఆర్ఎస్ తరఫున ఆరు ప్రత్యేక బృందాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొనడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం, మిస్ మేనేజ్‌మెంట్ మరియు సింగరేణి--జెన్‌కోల మధ్య ఆర్థిక వ్యవహారాల గందరగోళమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి పడిపోతోందని, మరోవైపు జల విద్యుత్ కేంద్రాలు కూడా నీటి లభ్యత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితులపై వాస్తవాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నాయని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల కాలంలో స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 19,472 మెగావాట్లకు పెంచామని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులకు ఆరు గంటలకు మించి ఉచిత కరెంట్ అందడం లేదని, 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది' అన్న చందంగా తెలంగాణలో 1980ల నాటి పరిస్థితులు పునరావృతమవుతున్నాయని ధ్వజమెత్తారు. 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కేవలం 400 మెగావాట్లు, జైపూర్ సింగరేణి ప్లాంట్‌లో 1,200 మెగావాట్లకు గాను 544 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి అవుతోందని తెలిపారు.

### జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరా.. రూ.2,900 కోట్ల నష్టం

జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన సింగరేణి సంస్థ తక్కువ నాణ్యత కలిగిన జీ-13, జీ-14 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తగ్గి రూ.2,900 కోట్ల ప్రజాధనం నష్టపోయిందని కేటీఆర్ ఆరోపించారు. ఇది 'ఎల్‌నినో కాదని.. ఎల్ కాంగ్రెస్ ప్రభావమని' ఎద్దేవా చేశారు. సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని, రూ.1,600 కోట్ల మేర అక్రమాలు జరిగాయని పునరుద్ఘాటించారు. అలాగే సింగరేణికి ప్రభుత్వం నుంచి రూ.52 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉండటంతో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

### రంగంలోకి ఆరు బీఆర్ఎస్ పరిశీలన బృందాలు:

రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్ల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బీఆర్ఎస్ తరఫున ఆరు ప్రత్యేక కమిటీలను



వేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. యాదాద్రి ప్లాంట్‌ను జగదీశ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం, కొత్తగూడెంను వద్దిరాజు రవిచంద్ర, తాతా మధు బృందం, భద్రాద్రి ప్లాంట్‌ను పువ్వాడ అజయ్ బృందం, కాకతీయ ప్లాంట్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు బృందం, జైపూర్ సింగరేణి ప్లాంట్‌ను జోగు రామన్న, బాల్క సుమన్ బృందం మరియు హైదరాబాద్ సింగరేణి సీసిఓను కొప్పుల ఈశ్వర్ బృందం సందర్శించి నివేదిక ఇవ్వనున్నాయి. ఈ నివేదికల ఆధారంగా తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఎన్నికలకు ఇప్పటి నుంచే రెడీ కావాలి

- క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి
- పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలి
- ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలి
- బీజేపీ శ్రేణులకు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దిశానిర్దేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. ఎన్నికలు వచ్చినప్పుడు హడావుడి చేయడం కాకుండా ముందుగానే క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో పార్టీకి మరింత ఆదరణ పెరిగేలా కార్యాచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి రామచందర్‌రావు అధ్యక్షత వహించారు. రానున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు ఇతర ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్య నేతలతో చర్చించారు. పార్టీ బలం క్షేత్రస్థాయిలోనే ఉంటుందని, అందుకే ప్రతి నాయకుడు తనకు అప్పగించిన ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రామచందర్‌రావు సూచించారు. పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంతోపాటు వారితో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని చెప్పారు. పార్టీ నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్త వరకు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. ఎక్కడ బలహీనతలు ఉన్నాయో గుర్తించి వాటిని అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. ఎన్నికలకు సిద్ధమవడం అంటే కేవలం సమావేశాలు నిర్వహించడం కాదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వారి మధ్య ఉండాలని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలతోపాటు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. రాజకీయాలు ఎన్నికలు, ఓట్లకే పరిమితం కాకుండా ప్రజాసేవకు వేదిక కావాలన్నారు. నాగోల్‌లో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న రామచందర్‌రావు స్వయంగా రక్తదానం చేశారు. ఇతరుల ప్రాణాలను కాపాడే రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని పిలుపునిచ్చారు.

### సమన్వయమే కీలకం

రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కీలకమని రామచందర్‌రావు పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. గత నెలలో జరిగిన పార్టీ సమీక్షలోనూ సంస్థాగత బలోపేతం, నాయకుల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వానికి సూచనలు అందాయి. ఎన్నికల వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే కార్యాచరణను అమలు చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



# మా భూముల హద్దులు నిర్ధారించాలి

### కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు రైతుల వినతిపత్రం

### కలకలం రేపుతోన్న ఎర్రవల్లి భూ సర్వే వివాదం

**మర్కుక్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం) :** సిద్దిపేట జిల్లా మర్క్యూక్ మండలంలో భూ వివాదం కలకలం రేపుతోంది. అధికారులు ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల ప్రకారం కాకుండా వేరే సర్వే నంబర్ల పేరుతో వచ్చి భూములు కొలుస్తున్నారంటూ శివారు వెంకటాపుర్ గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాస్ పుస్తకాలు ఉన్న తమ భూములకు హద్దులు నిర్ధారించి న్యాయం చేయాలని కోరుతూ ఎంఆర్వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం, రికార్డుల వ్యత్యాసం వల్ల దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆరోపించారు. శివారు వెంకటాపుర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 41,85,88,77,100 లలో తమకు అధికారికంగా ధరణి పాస్ పుస్తకాలు, అలాగే పూర్వపు ఇందిరమ్మ పట్టాలు ఉన్నాయని రైతులు స్పష్టం చేశారు. కానీ అధికారులు ఎర్రవల్లి శివారుకు చెందిన సర్వే నంబర్ 325తో తమ భూములకు సంబంధం ముడిపెట్టి తమను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు వాపోతున్నారు. ముందస్తు నోటీసులు లేకుండా వచ్చి సర్వే నిర్వహించడాన్ని సర్వే అధికారులను అడ్డుకుని నిరసన తెలిపారు. 'మాకు అధికారులే 41 సర్వే నంబర్ల పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారు.. మేము 41 లోనే వ్యవసాయం చేసుకుంటున్నాం.. ఇప్పుడు వచ్చి మమ్మల్ని వెళ్లగొట్టి కొలుస్తామంటే ఎట్లా.. సిఎం రేవంత్ రెడ్డి స్పందించి రికార్డుల ప్రకారం సర్వే చేయించి మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాం' అన్నారు. సర్వే నంబర్లు 41, 85, 88, 77, 100 లను తీసుకెళ్లి 325 సర్వే నంబర్‌లో కలిపేశారు. గుర్రాల సూరయ్య, దర్శనాల చంద్రయ్య, కుమార్‌లకు ధరణి పాస్ పుస్తకాలు ఉన్నా కూడా మాకు నోటీసులు ఇవ్వకుండా కొలవడానికి వచ్చారన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శివారు వెంకటపూర్ రైతులు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సరితకు వినతి పత్రం అందజేశారు. వెంటనే చర్యలు తీసుకుని మా శివారు హద్దులు నిర్ధారించి మాకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరగాలి

### భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు

### డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలి

### ఉత్సవ కమిటీలకు సూచించిన డీజీపీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ సి.వి.ఆనంద్ తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతిని బుధవారం దర్శించుకున్న ఆయన రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని డీజీపీ గుర్తు చేశారు. నాడు సుదర్శన్, ఇప్పుడు వారి కొడుకులు సందీప్, రాజ్ కుమార్, కూతురు వీణ, మహేష్ యాదవ్, ఇతర సభ్యులు శాంతియుతంగా నిమజ్జనాలు చెయ్యడానికి చాలా సహకరిస్తారని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పది రోజుల గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతున్నాయని, రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం మోహరించినట్లు వెల్లడించారు. నిమజ్జనాల కోసం జీహెచ్ఎంసీ, విద్యుత్, జలవనరులు, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై అవసరమైనచోట్ల క్రేన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీజీపీ తెలిపారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించామని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. అధిక శబ్దాలతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని స్వచ్ఛందంగా నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని డీజీపీ ఆనంద్ సూచించారు.



## సంపాదకీయం



# రాహుల్ వర్సెస్ అఖిలేశ్

## కూటమిలో మాటల పోరు!

**యూపీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ నేతల మధ్య భిన్న స్వరాలు**

**అఖిలేశ్ నాయకత్వాన్ని సమర్థించిన ఎంపీ ఇక్రా హసన్**

**రాహుల్ గాంధీ లేకుండా సాధ్యం కాదన్న కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్**

**2024లో కలిసి 43 లోక్‌సభ స్థానాలు గెలిచిన రెండు పార్టీలు**

**2027 అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై ఇంకా కుదరని ఒప్పందం**

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమిలో నాయకత్వంపై చర్చ మొదలైంది. రెండు పార్టీల అగ్రనేతలు కూటమిని కొనసాగించేందుకు సానుకూలంగా ఉన్నప్పటికీ, ఆయా పార్టీల ఎంపీలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ చర్చకు దారితీశాయి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కోవడంలో అఖిలేశ్ యాదవ్ పాత్రను సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్ ప్రధానంగా ప్రస్తావించగా, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ రాహుల్ గాంధీ ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు. దీంతో 2027 ఎన్నికలకు ముందు కూటమిలో నాయకత్వం, సీట్ల పంపకాల అంశాలు మరోసారి తెరపైకి వచ్చాయి.

### ‘అఖిలేశ్ లేకుండా సాధ్యం కాదు’

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కోవడంలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కీలకమని కైరానా ఎంపీ ఇక్రా హసన్ మంగళవారం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఒంటరిగా పెద్దగా సాధించలేదని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే రెండు పార్టీలు కలిసి పనిచేస్తే వాటి బలం పెరుగుతుందని కూడా పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలు కూటమిలో సమాజ్‌వాదీ పార్టీ పాత్రపై చర్చకు దారితీశాయి.

### ‘రాహుల్ పాత్రను విస్మరించలేరు’

ఇక్రా హసన్ వ్యాఖ్యలపై సహారన్‌పూర్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష గొంతుకగా రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారని, ఆయన కృషిని విస్మరించలేమని పేర్కొన్నారు. కాంగ్రెస్ లేకుండా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కోవడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. సీట్ల పంపకాలపై రెండు పార్టీలు త్వరగా నిర్ణయం తీసుకోవాలని మసూద్ ఇప్పటికే కోరారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీలో పనిచేసిన ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

### గత ఎన్నికల్లో కలిసి 43 స్థానాలు

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. రాష్ట్రంలోని మొత్తం 80 స్థానాల్లో రెండు పార్టీలు కలిపి 43 స్థానాలను గెలుచుకున్నాయి. సమాజ్‌వాదీ పార్టీకి 37, కాంగ్రెస్‌కు ఆరు స్థానాలు దక్కాయి. అయోధ్య ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ స్థానాన్ని కూడా సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకుంది. ఈ ఫలితాల నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కూటమిని కొనసాగించే అంశంపై ఇరు పార్టీల అగ్రనేతలు సానుకూల ప్రకటనలు చేశారు.

### సీట్ల పంపకాలపై ఇంకా స్పష్టత లేదు

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే అంశంపై ఇప్పటివరకు తుది ఒప్పందం కుదరలేదు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ సీట్ల పంపకాలను త్వరగా ఖరారు చేయాలని కోరుతుండగా, కూటమికి సంబంధించిన నిర్ణయాలను అఖిలేశ్ యాదవ్, రాహుల్ గాంధీ తీసుకుంటారని సమాజ్‌వాదీ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు పార్టీల ఎంపీల పరస్పర వ్యాఖ్యలు ఎన్నికల సన్నాహాల్లో రాజకీయ చర్చకు కారణమయ్యాయి. అయితే అగ్రనేతల మధ్య కూటమి కొనసాగింపుపై విభేదాలు తలెత్తినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఎన్నికల సంఘంలో ‘విభేదాల’ దుమారం

- పది నెలల్లో 14 సార్లు ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలంటూ కథనం
- ఓటర్ల జాబితా, ఫారం-6 మార్పులు, సమాచార కేంద్రీకరణపై ప్రశ్నలు
- అవి అభిప్రాయాలు మాత్రమే.. తుది నిర్ణయాలపై విభేదాలు లేవన్న ఈసీ
- ‘సర్’ సహా నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టీకరణ
- దుమారం రేపిన కథనం.. ఎన్నికల సంఘంపై విపక్షాల విమర్శలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** కేంద్ర ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు తలెత్తాయంటూ వెలువడిన మీడియా కథనం రాజకీయ దుమారం రేపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో కలిసి పనిచేస్తున్న ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని చర్యలపై అధికారికంగా అభ్యంతరాలు నమోదు చేసినట్లు ‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ దర్యాప్తు కథనం వెల్లడించింది. అయితే ఎన్నికల సంఘం ఈ కథనంలో వచ్చిన ‘విభేదాల’ వాదనను తోసిపుచ్చింది. కమిషనర్లు వివిధ అంశాలపై అభిప్రాయాలు, పరిశీలనలు వ్యక్తం చేయడం సహజమని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణతో సహా తుది నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే తీసుకున్నట్లు స్పష్టం చేసింది. సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఓటర్ల జాబితా సమాచార నిర్వహణ, ఎన్నికల సంఘం సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన చర్యలపై ప్రశ్నలు లేవనెత్తినట్లు దర్యాప్తు కథనం పేర్కొంది. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండానే తీసుకున్నట్లు ఇద్దరు కమిషనర్లు అధికారిక రికార్డుల్లో పేర్కొన్నారని తెలిపింది. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో మార్పులు చేయడంపైనా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనం వెల్లడించింది. నిబంధనల్లో అవసరమైన మార్పులు చేయకుండా చట్టబద్ధమైన దరఖాస్తు పత్రంలో మార్పులు చేయడాన్ని వివేక్ జోషి ప్రశ్నించారని, అనంతరం సంధు కూడా ఆ మార్పును ‘అనధికారికం, చట్టవిరుద్ధం’గా పేర్కొంటూ తొలగించాలని రికార్డులో నమోదు చేసినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా సమాచార నిర్వహణ క్రమంగా కేంద్రీకృతమవుతోందన్న ఆందోళనను కూడా ఇద్దరు కమిషనర్లు వ్యక్తం చేసినట్లు కథనం పేర్కొంది. చట్టబద్ధంగా ఓటర్ల జాబితాను నిర్వహించే క్షేత్రస్థాయి అధికారులకు పూర్తి స్థాయి ప్రవేశం ఉండాలని, ఇతరులకు ఓటర్ల సమాచారంలో మార్పులు చేసే అవకాశం ఉండకూడదని జోషి సూచించినట్లు తెలిపింది. రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారులకు అవసరమైన పూర్తి ప్రవేశం లేదన్న అంశాన్ని సంధు కూడా ప్రస్తావించినట్లు పేర్కొంది. ఈ కథనం నేపథ్యంలో ఎన్నికల సంఘం వర్గాలు స్పందిస్తూ కమిషన్‌లో అధికారిక విభేదాలున్నాయన్న వాదనను ఖండించాయి. ఎన్నికల కమిషనర్లు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు, పరిశీలనలు నమోదు చేయవచ్చని, వాటిని అధికారులు పరిశీలిస్తారని పేర్కొన్నాయి. అలాంటి పరిశీలనలను కమిషన్ తుది నిర్ణయాలపై అసమ్మతిగా పరిగణించరాదని స్పష్టం చేశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి భాగస్వామ్యంతోనే నిర్ణయాలు తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం తెలిపింది. దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన తుది నిర్ణయాలు కూడా ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు పేర్కొంది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లకు సంబంధించిన చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం కమిషన్ కార్యకలాపాలను సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా నిర్వహించాలి. ఏదైనా అంశంపై ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయభేదం ఏర్పడితే మెజారిటీ అభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకోవాలి. ఈ నిబంధనలను కూడా ఇద్దరు కమిషనర్లు తమ అంతర్గత నోట్లలో ప్రస్తావించినట్లు దర్యాప్తు కథనం తెలిపింది. ఈ కథనం వెలువడిన తర్వాత విపక్ష నేతలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన ఉద్ధవ్ వర్గం తదితర పార్టీల నేతలు ఈ వ్యవహారంపై వివరణ కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై చర్య తీసుకోవాలంటూ కొందరు విపక్ష నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం అంతర్గతంగా వ్యక్తమయ్యే అభిప్రాయాలను తుది నిర్ణయాలతో ముడిపెట్టడం సరికాదని, కమిషన్ నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.

# ఈసీపై కాంగ్రెస్ అగ్రనేతల ఘాటు దాడి

**అక్రమాలకు ఈసీ సహకరిస్తే అది తీవ్రమైన ‘దేశద్రోహ చర్య’: ప్రియాంక, రాహుల్ గాంధీ**

**ఓటు చోరీపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** దేశంలో ఎన్నికల నిష్పాక్షికత మరియు పారదర్శకతపై రాజకీయ రచ్చ పీక్ స్టేజ్‌కి చేరింది. కేంద్ర ఎన్నికల సంఘంలో అంతర్గత అభ్యంతరాలు, విభేదాలు ఉన్నాయంటూ ఓ ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ప్రచురించిన కథనం ఆధారంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. కేరళలోని మలప్పురం జిల్లా నిలంబూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ.. ఎన్నికలు పారదర్శకంగా జరగకపోతే ప్రజాస్వామ్యానికే అర్థం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరగడానికి ఎన్నికల సంఘం సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగే తీవ్రమైన దాడి అని ఆమె పేర్కొన్నారు. “ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఈ అక్రమాల గురించి తెలిసీ అనుమతిస్తుంటే, అది దేశంతో చేసే ద్రోహం.. తీవ్రమైన దేశద్రోహ చర్య క్రిందికే వస్తుంది” అని ప్రియాంక గాంధీ ఘాటుగా వ్యాఖ్యానించారు.

### ‘ఓటు చోరీ’ రాజ్యాంగంపై జరిగే దాడి:

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ‘ఓటు చోరీ’ అనేది భారత ప్రజలకు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరిగే తీవ్ర నేరమని, ఇది స్పష్టంగా రాజ్యాంగంపై జరిగే దాడని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ (ఆ) లో వీడియో పోస్ట్ చేస్తూ.. “ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్న పనులు రాజ్యాంగ విరుద్ధం. భవిష్యత్తులో సమయం వచ్చినప్పుడు చట్టపరంగా ఎవరినీ వదిలిపెట్టేది లేదు.. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయి” అని హెచ్చరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మార్పులు, ఓటు చోరీ ప్రక్రియ భారత ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీస్తోందన్నారు. ఈ అక్రమ ప్రక్రియలో భాగస్వాములవుతున్న అధికారులు రాజ్యాంగ వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

# విదేశీ కొలువులకు ‘స్కిల్ మ్యాపింగ్’

- భారత యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలే లక్ష్యం
- దాదాపు 20 దేశాల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ
- సంరక్షణ, నిర్మాణ రంగాల్లో భారీగా మానవ వనరుల అవసరం
- భారత్ జనాభా ప్రయోజనాన్ని అవకాశంగా మలిచే దిశగా కేంద్రం

షాంఘై ప్రపంచ నైపుణ్యాల పోటీలో 63 విభాగాల్లో భారత్ పోటీ



**షాంఘై (చైనా), సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** భారత యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలను మరింత విస్తరించే దిశగా కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ఉద్యోగ అవసరాలు, నైపుణ్య ప్రమాణాలకు అనుగుణంగా దేశీయ శిక్షణ విధానాలను అనుసంధానించే ప్రక్రియపై దృష్టి సారించింది. దాదాపు 20 దేశాల్లోని ఉద్యోగ ప్రమాణాలు, నైపుణ్య అవసరాలకు అనుగుణంగా భారత యువతకు శిక్షణ అందించే దిశగా కసరత్తు జరుగుతోందని మంత్రిత్వ శాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు మనీషా సేన్ శర్మ వెల్లడించారు. ప్రపంచంలోని పలు దేశాల్లో వృద్ధుల జనాభా పెరుగుతుండటం, పనిచేసే వయసులోని మానవ వనరులు తగ్గుతుండటంతో నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ పరిస్థితిని భారత యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశంగా మార్చేందుకు ఆయా దేశాల ఉద్యోగ ప్రమాణాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, శిక్షణ విధానాలను రూపొందించడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు.

### 20 దేశాల అవసరాలకు తగ్గట్టుగా..

విదేశాల్లో ఏయే రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి? ఆయా ఉద్యోగాలకు ఎలాంటి నైపుణ్యాలు అవసరం? అక్కడి పరిశ్రమలు ఎలాంటి ప్రమాణాలను కోరుతున్నాయి? వంటి అంశాలను గుర్తించి దేశీయ నైపుణ్య శిక్షణతో అనుసంధానించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మనీషా సేన్ శర్మ వివరించారు. దాదాపు 20 దేశాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. దేశీయంగా శిక్షణ పొందిన యువత విదేశాలకు వెళ్లిన తర్వాత మళ్లీ ప్రత్యేకంగా శిక్షణ పొందాల్సిన అవసరం లేకుండా, ఆయా దేశాల ఉద్యోగ ప్రమాణాలకు సరిపోయే నైపుణ్యాలతో వారిని ముందుగానే సిద్ధం చేయడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

### సంరక్షణ.. నిర్మాణ రంగాల్లో డిమాండ్

ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా సంరక్షకులు, నిర్మాణ రంగ కార్మికులతోపాటు నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం అవసరమైన అనేక ఉద్యోగాల్లో మానవ వనరుల కొరత ఉందని ఆమె పేర్కొన్నారు. యూఏఈ సహా పలు దేశాల్లో భారతీయ నైపుణ్య కార్మికులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొంటున్న సమయంలో యువ జనాభా అధికంగా ఉన్న భారత్‌కు ఇది కీలక అవకాశంగా మారుతుందని పేర్కొన్నారు. దేశంలోని యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నైపుణ్యాలను అందించగలిగితే రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ ఉద్యోగ విపణిలో భారత్ కీలక మానవ వనరుల కేంద్రంగా ఎదిగే అవకాశముందని తెలిపారు.

### షాంఘైలో నైపుణ్యాల సమరం

మరోవైపు చైనాలోని షాంఘై వేదికగా 48వ ప్రపంచ నైపుణ్యాల పోటీ ప్రారంభమైంది. సెప్టెంబర్ 22 నుంచి 27 వరకు జరిగే ఈ అంతర్జాతీయ పోటీల్లో భారత్ తన చరిత్రలోనే అతిపెద్ద బృందాన్ని బరిలోకి దించింది. 70 మంది భారత యువ ప్రతిభావంతులు మొత్తం 64 నైపుణ్య విభాగాల్లో 63 విభాగాల్లో పోటీపడుతున్నారు. ఈసారి భారత్ తొలిసారిగా 11 కొత్త నైపుణ్య విభాగాల్లోనూ పోటీపడుతోంది. దంత కృత్రిమ అవయవాల తయారీ, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్, ఇంటెలిజెంట్ సెక్యూరిటీ టెక్నాలజీ, ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్, ఆప్టోఎలక్ట్రానిక్ టెక్నాలజీ, రిటైల్ సేల్స్, మానవరహిత వైమానిక వ్యవస్థలు, ఇండస్ట్రియల్ మెకానిక్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, భారీ వాహన సాంకేతికత, విమానాల నిర్వహణ విభాగాల్లో భారత యువత తొలిసారి తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తోంది. షాంఘై పోటీల్లో మొత్తం 68 దేశాలు, ప్రాంతాల నుంచి 1,385 మంది యువ నిపుణులు 64 నైపుణ్య విభాగాల్లో తలపడుతున్నారు. సెప్టెంబర్ 22న ప్రారంభోత్సవం జరగగా, 23 నుంచి 26 వరకు ప్రధాన పోటీలు కొనసాగి 27న ముగింపు కార్యక్రమం జరగనుంది. దేశీయ పరిశ్రమల అవసరాలతోపాటు అంతర్జాతీయ ఉద్యోగ విపణి ప్రమాణాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం ద్వారా భారత్‌ను ప్రపంచ నైపుణ్య మానవ వనరుల కేంద్రంగా మార్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ పేర్కొంటోంది.

# గంభీరావుపేట మాలల ఐక్యవేదిక అధ్యక్షుడిగా ఎడబోయిన రాజు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల మాలల ఐక్యవేదిక నూతన అధ్యక్షుడిగా ఎడబోయిన రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాలల ఐక్యవేదిక నాయకులు, సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాల సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేయాలని నూతన కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, హక్కుల సాధన కోసం శాంతియుతంగా పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మాల సంఘాల నాయకులు, యువకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

# ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీపై రాష్ట్ర బృందం పరిశీలన



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** సిర్పూర్(యు) పాఠశాలలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం అమలు తీరును రాష్ట్ర బృందం బుధవారం పరిశీలించింది. పాఠశాలలో ఒకటి, రెండు, మూడు తరగతుల విద్యార్థుల అభ్యాసన ప్రగతి స్థాయిని బృంద సభ్యులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల అభ్యాసన స్థాయి, విద్యాబోధన తీరుపై వివరాలు సేకరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను తనిఖీ చేసి పాఠశాలలోని ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు విజయ్కుమార్, సాజిద్, అబ్దుల్ విశ్వనాథ్, మండల విద్యాధికారి కుడుమేత సుధాకర్, ప్రధానోపాధ్యాయులు ఆత్రం దత్తు, సీఆర్పీలు హనుమంతరావు, విఠల్, ఉపాధ్యాయులు కవిత, స్వప్న, షహనాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూతన తహశీల్దార్కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** మండల నూతన తహశీల్దార్గా నియమితులైన ఎండీ జమీర్ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎండీ జమీర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, స్థానిక సర్పంచ్ ఆత్రం ఓంప్రకాశ్, పంగిడి రాయి సెంటర్ సర్మేడి ఆత్రం మాకుతుర్సవ్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు కోవా నాందేవ్, మండల నాయకులు పెందూర్ అర్జున్, గేడం మోహన్, గజనాద్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# వర్షంతో సింగరేణి ఓసీల్లో పనులకు ఆటంకం

- **నీటితో జలమయమైన గనులు.. బురదమయమైన అంతర్గత రహదారులు**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిధిలో బుధవారం కురిసిన వర్షంతో సింగరేణి జేవీఆర్, కిష్టారం ఓపెన్కాస్ట్ గనుల్లోకి నీరు చేరడంతో పాటు అంతర్గత రహదారులు బురదమయంగా మారాయి. దీంతో బొగ్గు ఉత్పత్తి, ఓవర్బర్డెన్ (మట్టి) తవ్వకం పనులకు కొంతమేర ఆటంకం ఏర్పడింది. జేవీఆర్ ఓపెన్కాస్ట్ ప్రాజెక్టులో 4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా సుమారు 10వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడగా, 70వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తవ్వకం పనులు ప్రభావితమైనట్లు సింగరేణి వర్గాల సమాచారం. అయితే బొగ్గు డిస్పాచ్ ప్రక్రియపై వర్ష ప్రభావం పడలేదని అధికారులు తెలిపారు. గనుల్లోకి నీరు చేరడంతో భారీ యంత్రాల రాకపోకలకు, మట్టి తవ్వకం పనులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అంతర్గత రహదారులు బురదమయంగా మారడంతో వాహనాల రాకపోకలు కూడా మందగించాయి. వర్షం తగ్గుముఖం పట్టిన అనంతరం గనుల్లో నిలిచిన నీటిని తొలగించి పనులను యథావిధిగా కొనసాగించేందుకు సింగరేణి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# గడువులోగా హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, తిర్యాణి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన హియరింగ్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని తిర్యాణి మండలం రొంపల్లి గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాబితాలో ఓటు నమోదు కొరకు వచ్చిన దరఖాస్తులతో పాటు డిక్లరేషన్ తీసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన, కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రొంపల్లి గ్రామపంచాయతీలోని మెస్రంగూడ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్లను సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆదివాసీల ఇండ్ల గోడలపై వేసిన ముగ్గులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మర్కగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి వారికి చాక్లెట్లు అందజేశారు. రొంపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిలువల రిజిస్టర్ లను పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా వైద్యాధికారి ఆసుపత్రికి గైర్హాజరు కావడంపై జరవాణి ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సమాచారం అందించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నగేష్, వైద్యులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, తిర్యాణి :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి హాజరు పట్టిక, ఆపరేషన్ థియేటర్, మందుల నిల్వ గది పరిసరాలను పరిశీలించి, ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్న ప్రజల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్వరాలు, ఇతర అంటువ్యాధుల బారిన పడి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రతిరోజు ఆరోగ్య కార్యకర్తలు సందర్శించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని, నెలలు నిండిన గర్భిణులకు సుఖ ప్రసవం కొరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే ప్రజల పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం మండలంలోని విజయనగర్ గ్రామంలో గల జంగుబాయి మండల సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తయారు చేస్తున్న ఏకరూప దుస్తుల నాణ్యతను పరిశీలించారు. ఏకరూప దుస్తులు కుట్టడంలో నాణ్యత పాటించాలని, విద్యార్థులకు మరొక జత దుస్తులను త్వరగా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎ.పి.ఎం. శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు పనిచేయని జనరేటర్, లిఫ్ట్ సదుపాయాలను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇటీవల 5–6 గంటల పాటు విద్యుత్ నిలిచిపోవడంతో ఆక్సిజన్, అత్యవసర వైద్య పరీక్షల సేవలకు తీవ్ర విఘాతం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల విలువైన వైద్య పరికరాలు ఉన్నా టెక్నీషియన్లు లేకపోవడం, జనరేటర్, లిఫ్ట్ పనిచేయకపోవడంతో గర్భిణులు, వృద్ధులు, శస్త్రచికిత్స పొందిన రోగులు మెట్ల ద్వారా పైఅంతస్తులకు వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. వెంటనే జనరేటర్కు మరమ్మతులు చేయించి లేదా కొత్తది ఏర్పాటు చేసి, కరెంట్ పోయిన వెంటనే ఆటోమేటిక్గా ఆన్ అయ్యే వ్యవస్థను అందుబాటులోకి తేవాలని, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పర్యవేక్షణ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, నాయకులు అశోక్, కార్తిక్, టికానంద్, రాజేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# టీచర్ డిప్యూటేషన్ రద్దు చేయాలని విద్యార్థుల తరగతుల బహిష్కరణ

**పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన**

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలోని నర్సాపూర్ మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేసి, విద్యార్థులకు సజావుగా తరగతులు నిర్వహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థులు తరగతులను బహిష్కరించగా, తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాలలో మొత్తం 23 మంది విద్యార్థులు చదువుతుండగా, ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు తెలిపారు. అయితే వారిలో ఓ ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్పై బెల్లంపల్లికి పంపించడంతో విద్యార్థులకు తరగతులు సక్రమంగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆమె డిప్యూటేషన్ను రద్దు చేసి తిరిగి నర్సాపూర్ పాఠశాలలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయులైన శంకర్, రామచందర్ డిప్యూటేషన్పై వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ జ్యోతిని పంపించడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బందులు కలగకుండా పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఇకపై ఎలాంటి డిప్యూటేషన్లు చేపట్టకుండా విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో విద్యా కమిటీ చైర్మన్ కుర్సింగ భగవంతు రావు, స్థానికులు కుర్సింగ గణపతి, ధర్మారావు, కడెం వెంకటేష్, చంద్ర మారుతి, జయనేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# గంభీరావుపేటలో ఘనంగా గ్యార్వి షరీఫ్ వేడుకలు

- **గౌస్-ఏ-ఆజం జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు**

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: మండల కేంద్రంలో మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో గ్యార్వి షరీఫ్ వేడుకలను ముస్లిం సోదరులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌస్-ఏ-ఆజం హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ రహ్మతుల్లాహ్ అలైహ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పెద్ద నాల్ సాబ్ మసీదు సమీపంలోని హజ్రత్ గౌస్-ఏ-ఆజం రహ్మతుల్లాహ్ అలైహ్ దర్గా వద్ద ముస్లిం పెద్ద సంఖ్యలో పాల్గొని ఫాతేహా నిర్వహించారు. స్వీట్లు, అన్నంతో ఫాతేహా సమర్పించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గౌస్-ఏ-ఆజం రహ్మతుల్లాహ్ అలైహ్ చూపిన ఆధ్యాత్మిక మార్గాన్ని స్మరించుకున్నారు. ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలని ప్రార్థించారు. గ్యార్వి షరీఫ్ సందర్భంగా ముస్లిం సోదరులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మీలాద్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి

- పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి: సీపీ సునీల్ దత్

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. నిమజ్జన సందర్భంగా చేపట్టాల్సిన విధులు, భద్రతా చర్యలపై ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, జనసమ్మర్థం, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్లో సమయానికి హాజరై విధులు నిర్వహించాలని ఆదేశించారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. విగ్రహాల ఊరేగింపులు నిర్దేశిత మార్గాల్లోనే సాగేలా చూడాలని, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. నిమజ్జన వాహనాలపై అధిక సంఖ్యలో వ్యక్తులు ఎక్కకుండా, ప్రమాదకరంగా ప్రయాణించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనే వారిపై, డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, బాణసంచా తదితర అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. నిమజ్జన కేంద్రాల వద్ద బారికేడింగ్, లైటింగ్, రక్షణ సిబ్బంది ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయో ముందుగానే పరిశీలించాలని సూచించారు. ఎవరూ ప్రమాదకరంగా నీటిలోకి వెళ్లకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో రెస్క్యూ, వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ప్రజలతో పోలీసులు మర్యాదగా వ్యవహరిస్తూ అవసరమైన చోట మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకుంటే ఆలస్యం చేయకుండా స్పందించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయ కుమార్, ఏసీపీ రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# 'ఉద్యమ కెరటం' కథనానికి స్పందన

## కుల ధ్రువీకరణ పత్రాల జాప్యంపై తహశీల్దార్ సిబ్బంది చర్యలు


**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై 'ఉద్యమ కెరటం' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది స్పందించారు. కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీ-సేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ నిర్ణీత సమయంలో పత్రాలు అందకపోవడంతో దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. "నెల రోజులు గడిచినా.. జాడలేని కుల ధ్రువీకరణ పత్రం..!" అనే శీర్షికతో ప్రచురితమైన కథనంలో దరఖాస్తు చేసుకున్న అనంతరం పత్రాల కోసం ఎదురుచూస్తున్న బాధితుల సమస్యలను వివరంగా ప్రస్తావించారు. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాల కోసం కుల ధ్రువీకరణ పత్రాలు కీలకంగా ఉండటంతో, అవి సమయానికి అందకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు.



GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT
FORM III A

COMMUNITY CERTIFICATE

ఈ కథనంపై స్పందించిన తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులకు సంబంధించిన వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే



నెల రోజులు గడిచినా.. జాడలేని కుల ధ్రువీకరణ పత్రం..!

జాప్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

బాధితుల డిమాండ్

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకొని నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రం అందకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆగస్టు 23వ తేదీన మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న ఎందుకు జారీ కాలేదో అధికారులు స్పష్టం చేయాలని బాధితులు కోరుతున్నారు. దరఖాస్తు ఏ అధికారి వద్ద పెండింగ్లో ఉందో పరిశీలించి, నిర్లక్ష్యానికి కారణమైన అధికారులను గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రం అవసరమైన విద్య, ఉద్యోగం, ప్రభుత్వ పథకాలు తదితర విషయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా తహశీల్దార్ మారుతి రెడ్డి వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న దరఖాస్తును పరిశీలించి, అర్హత ఉన్న వారికి వెంటనే ధ్రువీకరణ పత్రం అందేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

GOVERNMENT OF TELANGANA
MeeSeva Portal

దరఖాస్తుల్లో ఏమైనా లోపాలు, అదనపు పత్రాలు అవసరమైతే సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించి, వాటిని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని సిబ్బంది తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు కార్యాలయ సిబ్బంది చర్యలు చేపట్టినట్లు వివరించారు.

### సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన ఉద్యమ కెరటం..

ప్రజలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, ఈ నేపథ్యంలో కుల ధ్రువీకరణ పత్రాల జాప్యంపై ఉద్యమ కెరటం ప్రచురించిన కథనానికి అధికారుల స్పందన ప్రాధాన్యత సంతరించుకుంది. కథనం ప్రచురితమైన అనంతరం అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి కుల ధ్రువీకరణ పత్రం అందేలా చర్యలు కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల శాఖ కమిషనర్ సురేంద్రమోహన్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వానాకాలం ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన అన్నిరకాల మౌళిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ, సన్నరకం వరి ధాన్యం కొనుగోలు, బోనస్ చెల్లింపు, ధాన్యం సేకరణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి వ్యవసాయ పట్టభద్రుడు, డిప్లమా అభ్యర్థిని గుర్తించి, సన్నరకం వరి ధాన్యాలపై శిక్షణ ఇచ్చి వాలంటీర్గా నియమించాలని సూచించారు. వారికి నెలవారీ గౌరవభృతి చెల్లించి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి ముందే తూకం యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్లు తదితర అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయకుండా ముందుగానే అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ధాన్యం సేకరణ, రవాణా, నిల్వలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించేలా వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన శిక్షణ, సూచనలు అందించడంతో పాటు రైతులకు ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, కొనుగోలు విధానంపై అవగాహన కల్పించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వానాకాలం ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం 2026-27 ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కేకే ఓసీలో ఉత్పత్తి వేగం పెంచాలి

- నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలి: సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు

**ఉద్యమ కెరటం, మందమర్రి:** మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్కాస్ట్ గనిని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె.వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. సీపీఅండ్పీ కార్పొరేట్ ఏ.మనోహర్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ, ఇతర అధికారులతో కలిసి గనిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, రవాణా మార్గాలు, కార్మికుల భద్రతా చర్యలపై అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత త్రైమాసిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా సాధించేందుకు ఉత్పత్తి వేగాన్ని మరింత పెంచాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించవచ్చని తెలిపారు. అనంతరం ఎక్స్ప్రెస్ ఓబీ కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను వేగవంతం చేయాలని సూచించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించుకుని పనులు కొనసాగించాలని ఆదేశించారు. ఉత్పత్తితో పాటు ప్రతి కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. "భద్రతతో కూడిన ఉత్పత్తే సమర్థవంతమైన ఉత్పత్తి" అని పేర్కొన్నారు. ఉద్యోగులు సురక్షిత వాతావరణంలో పనిచేసేలా అన్ని రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో ప్రతి కార్మికుడి పాత్ర కీలకమని, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే నిర్దేశిత లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. బొగ్గు తవ్వకాలతో పాటు గని పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, సేఫ్టీ అధికారి పైడయ్య, ఎస్అండ్పీసీ (ఏఎస్ఓ) వెంకటేశ్వరరెడ్డి, కేకే ఓసీపీ అధికారులు, ఎక్స్ప్రెస్ కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో మౌళిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కోరారు. బుధవారం హైదరాబాద్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల పరిసరాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# మహేష్కుమార్ గౌడ్కు నాగేష్ పటేల్ శుభాకాంక్షలు

**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పదవీకాలం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగేష్ పటేల్ కుర్ల బుధవారం హైదరాబాద్లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మహేష్కుమార్ గౌడ్కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత రెండేళ్లుగా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో, కార్యకర్తల్లో ఉత్సాహం నింపడంలో మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం జుక్కల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, యువజన నాయకత్వం, రాబోయే మార్కెట్ కమిటీ, సొసైటీ చైర్మన్ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి జహీరాబాద్ పార్లమెంట్ పరిధి వరకు పార్టీ కార్యక్రమాలను విస్తరించడంలో ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చర్చించినట్లు పేర్కొన్నారు.



# నిఘా నీడలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర

- 420 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు.. 162 సీసీ కెమెరాలు, 3 డ్రోన్లతో నిఘా
- జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర




**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** గణేష్ నిమజ్జన శోభ యాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు కామారెడ్డి పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. 420 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు శోభ యాత్ర మార్గంలో 162 సీసీ కెమెరాలు, మూడు డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిమజ్జన బందోబస్తుపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లు, నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన చోట బారికేడింగ్, ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయాలని ఆదేశించారు. శోభ యాత్రలో పాల్గొనే భక్తులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం సేవించి శోభ యాత్రలో పాల్గొనడం, వాహనాలు నడపడం చేయకూడదని తెలిపారు. డీజేలు, సౌండ్ సిస్టమ్స్కు సంబంధించిన నిబంధనలు, శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు, ఈత రాని వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు, నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి వివాదాలు, గొడవలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా, అవాంఛనీయ పరిస్థితి ఎదురైనా వెంటనే పోలీసులకు, డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జనం అనంతరం రహదారులపై చెత్త, వ్యర్థాలు వేయకుండా పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని ప్రజలు, నిర్వాహకులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు అరెస్టు

- రూ.50 వేల నగదు, రెండు బైకులు, 10 కిలోల కాపర్ వైరు, 5 సెల్ఫోన్లు స్వాధీనం



**ఉద్యమ కెరటం, తాండూర్:** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.50 వేల నగదు, రెండు బైకులు, 10 కిలోల కాపర్ వైరు, ఐదు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ కిరణ్కుమార్ తెలిపారు. బుధవారం తాండూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తాండూర్, భీమిని, బెల్లంపల్లి, నెన్నెల, తాళ్లగురజాల, తిర్యాణి, రెబ్బెన పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లు, దుకాణాలు, వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని నిందితులు దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదుతో పాటు బైకులు, కాపర్ వైరు, సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. అరెస్ట్ చేసిన వారిలో రెబ్బెన మండలం నార్లాపూర్కు చెందిన బండి నీలేష్, తాండూర్ మండలం కత్తెర్లకు చెందిన దూల రాజేశం, మీసాల బిక్షపతి, దూల నవీన్, బెల్లంపల్లి మండలం పట్వాన్పల్లికి చెందిన ఈగామ్ రాజేష్, రెబ్బెన మండలం రోల్లపాడుకు చెందిన రెబ్బెన శ్రీకాంత్ ఉన్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన తాండూర్ సీఐ ఎన్.దేవయ్య, ఎస్సై కే.ప్రసాదరావు, భీమిని ఎస్సై పి.కోటేశ్వర్తో పాటు పోలీసు సిబ్బందిని అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన హెడ్ కానిస్టేబుళ్లు టి.రాజేశ్వర్, ఎం.రాము, వి.తిరుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు ఎం.విజయ్కుమార్, బి.తిరుపతికి క్యాష్ రివార్డు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గంభీరావుపేట సింగిల్ విండో చైర్మన్గా వేశాల వెంకటి



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల సింగిల్ విండో సహకార సంఘం చైర్మన్గా వేశాల వెంకటి నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధిత అధికారులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సింగిల్ విండో చైర్మన్గా బాధ్యతలు స్వీకరించనున్న వేశాల వెంకటిని పలువురు నాయకులు, సహకార సంఘం సభ్యులు, రైతులు అభినందించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణాలు, సహకార సేవలు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సహకార సంఘం ద్వారా వారికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని వేశాల వెంకటి తెలిపారు.

# ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత, సురక్షిత తాగునీటి లభ్యతను నిర్ధారించేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్ ఛాంబర్లో బుధవారం జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా మండలి (డీఎల్ఏసీ) సమావేశం నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి.విక్రమ్ నిర్వహణలో జరిగిన సమావేశానికి అదనపు కలెక్టర్ ఎన్.వై.గిరి, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆహార నిల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఆహార భద్రత నిబంధనలు పాటించని వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహార భద్రత తనిఖీలను మరింత విస్తృతం చేసి, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రసన్న, డీపీఓ మురళి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

- ముందస్తు జాగ్రత్తలతో పటిష్ట ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వినాయక నవరాత్రుల అనంతరం నిర్వహించే నిమజ్జన కార్యక్రమాన్ని సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం దండేపల్లి మండలం గూడెంలోని నిమజ్జన ప్రాంతాన్ని ఎంపీడీఓ ప్రసాద్, ఎస్సైలతో కలిసి పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ద్వారక గ్రామంలో కొనసాగుతున్న షెడ్యూల్డ్ తెగల బాలుర సంక్షేమ వసతి గృహం పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, విద్యాబోధన, పరిసరాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని తహశీల్దార్ రోహిత్ దేశ్పాండే, ఎంపీడీఓలతో కలిసి సందర్శించారు. భోజనశాల, వంటశాల, అదనపు గదులు, సామగ్రి నిల్వ గది, వసతి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, ఆహారం తయారీలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాల హాజరు పెరిగేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి సమర్పించిన ధ్రువపత్రాలను పారదర్శకంగా, వేగవంతంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. పిల్లలకు అవసరమైన టీకాలను సకాలంలో అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని గణేష్ నిమజ్జన చెరువును ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్కుమార్, పంచాయతీ కార్యదర్శి వినీల్రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్ తదితరులు పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలు, భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. నిమజ్జన మార్గంలో విద్యుత్ వైర్లు, స్తంభాలు, ఇతర ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు నిమజ్జన ప్రదేశంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని సీఐ, ఎస్సై కోరారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# వినాయక నిమజ్జనం వేళా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** వినాయక నిమజ్జనం వేళా తాండూర్ మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం తాండూర్ మండలంలో వినాయక నిమజ్జనం ఎంతో అట్టహాసంగా జరుపుకుంటామన్న వినాయక మండపాల నిర్వాహకుల ఆశలు ఆడియాశలయ్యాయి. సాయంత్రం ఐదు ఆరు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మండల కేంద్రంలో ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడడంతో వినాయక నిమజ్జనానికి అంతరాయం ఏర్పడింది. దీనికితోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చిమ్మ చీకట్లోనే వినాయక విగ్రహాల తరలింపు నత్తనడకన సాగింది. వినాయక నిమజ్జన కార్యక్రమానికి తాండూర్ పోలీసులు ప్రతిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనం వేళా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సరిచేయడంలో విద్యుత్ శాఖ సిబ్బంది పనితీరుపై వినాయక మండపాల నిర్వహకులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యుత్ శాఖలో కింది స్థాయి సిబ్బంది కొందరు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో స్పందించి తాండూర్ మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

# విద్యుత్ కోతలతో రైతులు విలవిల

- రైతులకు, గ్రామాలకు శాపంగా మారిన విద్యుత్ సమస్యలు
- విద్యుత్ అధికారులపై సర్పంచుల ఆగ్రహం
- సమస్యలు పరిష్కరించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరిక



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండల విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలు, పంచాయతీ సమావేశాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారే తప్పా, నెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించడం లేదని ఆరోపించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంపై సర్పంచులు, విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈలతో ఎంపీడీఓ కావ్య బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగపాలెం సర్పంచ్ యర్రా రమేష్, కందుకూరు సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, భీమవరం సర్పంచ్ వంట్ల రమేష్ మాట్లాడుతూ తమ గ్రామాల్లో నెలలుగా విద్యుత్ సమస్యలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలను ఏఈ దృష్టికి తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారని, ఏడీఈకి ఫిర్యాదు చేసినప్పటికీ ఏఈతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పడం తప్పా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదన్నారు. కందుకూరు, వెంకటాపురం, లచ్చన్నగూడెం, మర్లపాడు, భరిణపాడు, దుద్దేపూడి గ్రామాలకు చెందిన రైతులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఏడీఈ తరచూ మండలంలో పర్యటిస్తున్నప్పటికీ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు తన దృష్టికి రాలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని సర్పంచులు పేర్కొన్నారు. గ్రామాల్లో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా రోజుకు ఆరేడు గంటలకు మించి ఉండటం లేదని, అది కూడా తరచూ అంతరాయాలకు గురవుతోందని తెలిపారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతూ పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాల్లో హామీలు ఇవ్వడం కాకుండా క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచులు డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరంగల్లోని ఉన్నత విద్యుత్ శాఖ అధికారుల కార్యాలయానికి వెళ్లి సమస్యలను వివరిస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏడీఈ త్వరలోనే గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వేంసూరు సర్పంచ్ ఎండీ ఫక్రుద్దీన్, కల్లూరు గూడెం సర్పంచ్ రామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యకరమైన భవిష్యత్తును పొందవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలు, ఆయుర్వేద ఔషధాల వినియోగం, ప్రయోజనాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమణ వ్యాధుల నియంత్రణకు ఆరోగ్యకరమైన ఆహారం, క్రమబద్ధమైన జీవన విధానం, వ్యాయామం, యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాలోని 12 ఆయుర్వేద ఆసుపత్రుల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలు, అందుతున్న సేవలను పరిశీలించారు. శిబిరానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీధర్, జిల్లా ఆయుర్వేద వైద్యాధికారి నీరజ, జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్ రాథోడ్, ఆయుష్ వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన..

గణేశ్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి మండలంలోని నిమజ్జన ప్రాంతాలను అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య పరిశీలించారు. బారికేడింగ్, లైటింగ్, తాగునీరు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనమలీస్ జాబితాలోని ఓటర్ల ధ్రువ పత్రాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.





# వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు





- వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే

**ఉద్యమ కెరటం, వేములవాడ:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణంలో బుధవారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువు బండ్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే కలిసి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆసక్తిగా కార్యక్రమాలను తిలకించారు.

### వాటర్ ఫౌంటెన్ ప్రారంభం..

వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో గుడి చెరువులో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేవీస్సీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, తహశీల్దార్ జయంత్, పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# పవర్గూడలో ఘనంగా గణేష్ లడ్డూ వేలం

- రూ.21,500లకు లడ్డూ ప్రసాదం దక్కించుకున్న కోవా రవీందర్–గంగాదేవి దంపతులు



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గణేష్ లడ్డూ ప్రసాదానికి గ్రామస్తుల సమక్షంలో వేలంపాట నిర్వహించారు. రూ.5వేలతో ప్రారంభమైన లడ్డూ వేలంపాటలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరకు రూ.21,500లకు లడ్డూ ప్రసాదాన్ని కోవా రవీందర్–గంగాదేవి దంపతులు దక్కించుకున్నారు. దీంతో గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో గ్రామస్తులంతా ఐక్యంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తొడసం రాజేందర్ గ్రామస్తులకు గణేష్ నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఐక్యత, భక్తిభావంతో ఉత్సవాలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

# వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ 'మహా అన్న ప్రసాదం'

**ఉద్యమ కెరటం,చొప్పదండి/కొడిమ్యాల :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ గణేష్ సన్నిధిలో బుధవారం రోజున మధు రాధాకృష్ణ శర్మ పూజలు నిర్వహించారు .అనంతరం భక్తులకు దాదాపు 800 మందికి మహా అన్నప్రసాదం నిర్వహించారు. తొమ్మిది రోజులు పూజలు అందుకున్న లడ్డు శుక్రవారం డ్రా తీయబడుతుందని , 20 రూపాయల టికెట్ చెల్లించి డ్రాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, గణేష్ ప్రముఖులు ఏనుగు ఆదిరెడ్డి, బైరి వెంకటి, కాసం మునిందర్, వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ స్కూల్ కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**ఉద్యమ కెరటం,జిన్నారం:**
జిన్నారం మున్సిపల్ కేంద్రంలో గల ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ మేరకు బుధవారం పటాన్ చెరు నియోజకవర్గస్థాయిలో జీఎంఆర్ కన్వెన్షన్ లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ కు చెందిన కార్తీక్ రాజ్ అందుకున్నారు. ప్రశంసా పత్రం జ్ఞాపిక శాలువాతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సన్మానం అందుకోవడం ఆనందంగా ఉందంటూ కార్తీక్ రాజ్ సంతోషం వెలిబుచ్చారు. ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతూ వారి బంగారు భవితకు బాటలు వేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం పొందడం అభినందనీయమని ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

# 108 ప్రదక్షిణలతో మార్మోగిన రుద్రారం సిద్ధి గణపతి ఆలయం

- శ్రీ శాకాంబరేశ్వరుడి దివ్యాలంకరణలో దర్శనమిచ్చిన గణనాథుడు

**ఉద్యమ కెరటం,పటాన్చెరు:**
రుద్రారం శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10వ రోజు బుధవారం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సూర్యోదయానికి ముందే వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారికి 108 ప్రదక్షిణలు నిర్వహించారు. 11 రోజుల సంకల్ప ప్రదక్షిణల్లో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధి గణపతి స్వామివారు శ్రీ శాకాంబరేశ్వరుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల తాజా కూరగాయలతో మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. ఈ దివ్యాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈవో లావణ్యతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రముఖులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, సాయి గణేష్, సతీష్ కుమార్, మురళి గౌడ్, సంతోష్, ప్రభు, శివ రాములు, రాజేష్ గౌడ్, ముకుంద రెడ్డి, నారాయణ రెడ్డి, మహేష్, కృష్ణ, శ్రీనివాస్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# మంటలు చెలరేగే వరకు పర్యవేక్షణ ఏం చేసింది?

## ప్రాణాలు కాపాడాల్సిన చోటే విషాదం

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాలను కాపాడాల్సిన అత్యంత సున్నితమైన వార్డులోనే మంటలు చెలరేగి ఐదుగురు పసికందులు ప్రాణాలు కోల్పోవడం.. ప్రమాదం కంటే పెద్ద ప్రశ్నను సమాజం ముందుంచింది. ఆదిలాబాద్ రిమ్స్‌లోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో సెప్టెంబర్ 21 అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఘటన సమయంలో 27 మంది నవజాత శిశువులను అక్కడి నుంచి తరలించినట్లు అధికారులు, పలు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఏసీ యూనిట్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు ప్రారంభమై ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలినప్పటికీ.. అదే అంతిమ కారణమని ఇప్పుడే నిర్ధారించలేం. ఏసీ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించిందని అధికారులు తెలిపారు. తొలుత ముగ్గురు శిశువులు మృతి చెందగా.. చికిత్స పొందుతున్న మరో ఇద్దరు సెప్టెంబర్ 23న మృతి చెందడంతో సంఖ్య ఐదుకు చేరింది. అసలు ప్రశ్న ఏసీ ఎందుకు దెబ్బతిన్నదన్నదొక్కటే కాదు.. ఇంత సున్నితమైన విభాగంలో విద్యుత్, అగ్నిమాపక, పొగ హెచ్చరిక, అత్యవసర తరలింపు వ్యవస్థలు ముందుగానే ఎంత సమర్థంగా ఉన్నాయన్నదీ తేలాలి.

### ఆరోపణలు వేరు.. ఆధారాలు వేరు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణ, పర్యవేక్షణలో లోపాలే ఘటనకు కారణమని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయాలని కోరారు. మాజీ మంత్రి జోగు రామన్న కూడా ఆస్పత్రి నిర్వహణ, భద్రతపై ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సమగ్ర విచారణ కోరారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ రిమ్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, మరమ్మతులకు నిధులు కోరామని చెబుతున్నారు. ఈ వాదనలన్నింటినీ వాటి రాజకీయ సందర్భంలోనే చూడాలి. ఎవరి ఆరోపణ నిజమో, ఎవరి వాదనకు ఎంత ఆధారం ఉందో తేల్చేది రాజకీయ ప్రకటనలు కాదు.. అధికారిక పత్రాలు, నిర్వహణ రికార్డులు, విద్యుత్ తనిఖీ నివేదికలు, అగ్నిమాపక భద్రతా వివరాలు, నిపుణుల విచారణ. అందుకే ముందుగానే ఎవరినీ బాధ్యుడిగా తేల్చకుండా.. లోపం ఎక్కడ జరిగిందో ఆధారాలతో నిర్ధారించడం అవసరం.

### ప్రభుత్వం స్పందించింది.. అసలు పరీక్ష విచారణదే

ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేసి, చికిత్స పొందుతున్న శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిమ్స్‌ను సందర్శించి ఘటన జరిగిన విభాగాన్ని పరిశీలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఏసీ యూనిట్‌లో విద్యుత్ లోపం వల్ల మంటలు ప్రారంభమై ఉండొచ్చని, కాలిన ప్లాస్టిక్ భాగాల వల్ల దట్టమైన పొగ వ్యాపించిందని తెలిపారు. అయితే భద్రతా ప్రమాణాల అమలులో, నిర్వహణలో లేదా పర్యవేక్షణలో లోపాలు ఉన్నాయా అన్నది సమగ్ర విచారణలోనే తేలుతుందని స్పష్టం చేశారు. విద్యుత్, అగ్నిమాపక, భవన భద్రతపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మృతి చెందిన ప్రతి శిశువు కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తాజా సమాచారం వెల్లడించింది. రిమ్స్‌లో 150 పడకల తల్లి--శిశు ఆరోగ్య కేంద్రాన్ని వేగంగా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఇవన్నీ తక్షణ చర్యలు మాత్రమే.. బాధ్యతను నిర్ణయించే అసలు పరీక్ష మాత్రం విచారణదే.

### పర్యవేక్షణ ఎక్కడ ఆగిపోయింది?

ఇక్కడే ఘటన అసలు ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఏసీ యూనిట్ నిర్వహణకు సంబంధించిన తనిఖీలు గతంలో ఎప్పుడు జరిగాయి? విద్యుత్ వ్యవస్థను నిర్దిష్ట కాల వ్యవధిలో పరీక్షించారా? అగ్నిమాపక పరికరాలు, హెచ్చరిక వ్యవస్థలు పనిచేసే స్థితిలో ఉన్నాయా? పొగ వ్యాపించినప్పుడు అత్యవసరంగా శిశువులను తరలించేందుకు తగిన మార్గాలు, పరికరాలు, సిబ్బంది శిక్షణ ఉన్నాయా? ఈ ప్రశ్నలు ఇప్పుడు కేవలం ఊహలు కావు. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కూడా ఘటనపై స్వయంచాలకంగా స్పందించి.. అగ్ని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ఎస్ఎన్‌సీయూ భద్రతా, నిర్వహణ ఏర్పాట్లు, రక్షణ చర్యలు, విచారణ వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆరోగ్యశాఖను కోరింది. విద్యుత్, ఏసీ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అగ్ని హెచ్చరిక వ్యవస్థలు, అత్యవసర తరలింపు ఏర్పాట్లపై వివరాలు కోరినట్లు కమిషన్ వెల్లడించింది. అందుకే "లోపం ఉందా?" అన్నదానికంటే "లోపం ఉంటే అది ఏ స్థాయిలో జరిగింది? ముందస్తు పర్యవేక్షణలో ఎందుకు గుర్తించబడలేదు? ఎవరి పరిధిలో ఆ బాధ్యత ఉంది?" అన్న ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం రావాలి.

### మంటలు ఆరినా.. బాధ్యత తప్పక తేలాలి

ఐదుగురు పసికందుల ప్రాణాలు కోల్పోయిన ఘటనను పరిహారంతోనో, రాజకీయ విమర్శలతోనో ముగించకూడదు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం అవసరమే.. కానీ ప్రాణాలను కాపాడే ప్రభుత్వ వైద్య వ్యవస్థకు అసలు పరీక్ష ప్రమాదానికి ముందే ముప్పును గుర్తించి నివారించడంలో ఉంటుంది. అందుకే ఏసీ పరికరాల నిర్వహణ నుంచి విద్యుత్ భద్రత వరకు, అగ్నిమాపక ఏర్పాట్ల నుంచి అత్యవసర తరలింపు మార్గాల వరకు ప్రతి అంశాన్ని రికార్డుల ఆధారంగా పరిశీలించాలి. ప్రభుత్వం ఇప్పటికే నిపుణుల విచారణ, విద్యుత్, అగ్నిమాపక, భవన భద్రతా తనిఖీలకు ఆదేశించిన నేపథ్యంలో.. నివేదికను వేగంగా పూర్తి చేసి వాస్తవాలను ప్రజల ముందుంచడం అత్యవసరం. తప్పిదం నిర్ధారణ కాకముందే ఎవరినీ దోషిగా తేల్చడం సరికాదు. అదే సమయంలో లోపం నిర్ధారణ అయితే.. అది ఏ స్థాయి నిర్వహణలో జరిగింది, ఎవరి పరిధిలో పర్యవేక్షణ బాధ్యత ఉంది, ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారు అన్నది స్పష్టంగా తేలాలి. ప్రాణాలు కోల్పోయిన పసికందులు తిరిగి రారు. కానీ వారి మరణం కేవలం ఒక విషాదంగా మిగిలిపోకూడదు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రమాదానికి ముందే ముప్పును గుర్తించే పర్యవేక్షణ, అప్రమత్తంగా స్పందించే వ్యవస్థ, ప్రాణాలను కాపాడే భద్రతా ప్రమాణాలు మరింత పటిష్ఠం కావాలి. ముఖ్యంగా జిల్లా యంత్రాంగం పరిధిలోని పర్యవేక్షణ వ్యవస్థల్లో ఎక్కడ లోపం జరిగిందో, ముందస్తు చర్యలు ఎక్కడ అవసరమయ్యాయో విచారణ తేల్చాలి. మంటలు ఆరిపోవడం ముగింపు కాదు.. పర్యవేక్షణలోని లోపాలు మళ్లీ ఏ ఆస్పత్రిలోనూ మరో ప్రాణాన్ని బలితీసుకోకుండా వ్యవస్థను మార్చడమే ఈ విషాదానికి నిజమైన సమాధానం.

ఫిరోజ్ ఖాన్
సీనియర్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464



# టీ20ల్లో భారత్ 200వ విజయం

**నాగోయా, సెప్టెంబరు 23 (ఉద్యమ కెరటం):** అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. జపాన్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రెండు పరుగుల తేడాతో విజయం సాధించడం ద్వారా భారత్ అంతర్జాతీయ టీ20ల్లో 200 విజయాలు పూర్తి చేసుకున్న తొలి జట్టుగా నిలిచింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌తో పాటు ఇతర అంతర్జాతీయ జట్లను వెనక్కి నెట్టి అరుదైన ఘనతను సాధించింది. 291 మ్యాచ్‌లు.. 200 విజయాలు: 2006లో అంతర్జాతీయ టీ20 ప్రయాణాన్ని ప్రారంభించిన భారత్ ఇప్పటివరకు 291 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఏకంగా 200 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. 81 మ్యాచ్‌ల్లో ఓటమి ఎదుర్కొన్న భారత్.. ఒక మ్యాచ్‌ను టైగా ముగించగా, మరో తొమ్మిది మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. అంతర్జాతీయ టీ20ల్లో ఇంతటి విజయాల సంఖ్యను సాధించిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. పాక్‌కు 24 విజయాల ఆధిక్యం: అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక విజయాలు సాధించిన జట్ల జాబితాలో పాకిస్థాన్ 176 విజయాలతో రెండో స్థానంలో ఉంది. పాకిస్థాన్ 2005 నుంచి ఇప్పటివరకు 303 టీ20 మ్యాచ్‌లు ఆడింది. భారత్ ప్రస్తుతం పాక్ కంటే 24 విజయాల ఆధిక్యంలో ఉంది. ఇంగ్లాండ్ దేశవాళీ జట్లలో సోమర్సెట్ 174 విజయాలతో తర్వాతి స్థానంలో ఉండగా.. లాంకషైర్ 166 విజయాలు సాధించింది. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ కూడా 166 విజయాలతో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్, సర్రే జట్లు 163 విజయాలతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. జపాన్‌తో ఉత్కంఠ పోరు: 200వ విజయం సాధించిన మ్యాచ్‌లో మాత్రం టీమిండియాకు ఊహించని స్థాయిలో పోటీ ఎదురైంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించారు.



తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు మాత్రమే చేసింది. చిన్న లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జపాన్ చివరి వరకు పోరాడింది. అయితే భారత బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీసి జపాన్‌ను 3 వికెట్లకు 30 పరుగులకే పరిమితం చేశారు. చివరి ఓవర్‌లో జపాన్ విజయానికి ఎనిమిది పరుగులు అవసరమైన సమయంలో భారత బౌలర్లు ఒత్తిడిని తట్టుకుని అద్భుతంగా బౌలింగ్ చేశారు. చివరి బంతి వరకు ఉత్కంఠ కొనసాగినా.. జపాన్ రెండు పరుగుల దూరంలో నిలిచిపోయింది. దీంతో భారత్ రెండు పరుగుల తేడాతో విజయం సాధించి 200వ అంతర్జాతీయ టీ20 విజయాన్ని నమోదు చేసింది. టీ20ల్లో భారత్ సాధించిన ఈ మైలురాయి ఆ ఫార్మాట్‌లో జట్టు సాధించిన స్థిరమైన విజయాలకు మరో గుర్తింపుగా నిలిచింది. ముఖ్యంగా 200వ విజయం కూడా అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రావడంతో ఈ రికార్డు మరింత ప్రత్యేకంగా మారింది.

# మీరాబాయి మెడలో ఆసియా రజతం

49 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో అద్భుత ప్రదర్శన

**నగోయా (జపాన్), సెప్టెంబర్ 23 (ఉద్యమ కెరటం):** భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు ఆసియా క్రీడల్లో పతకం సాధించారు. ఐచి--నగోయా ఆసియా క్రీడల్లో బుధవారం జరిగిన మహిళల 49 కిలోల విభాగంలో అద్భుత ప్రదర్శన చేసిన మీరాబాయి రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు. స్నాచ్‌లో 87 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోలతో మొత్తం 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. మీరాబాయి కెరీర్‌లో ఇదే తొలి ఆసియా క్రీడల పతకం. ఒలింపిక్స్‌లో రజతం.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం.. కామన్వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు.. ఇలా ఎన్నో అంతర్జాతీయ విజయాలు సాధించిన మీరాబాయి ఖాతాలో ఆసియా క్రీడల పతకం మాత్రం ఇప్పటివరకు లేదు. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల్లో తొమ్మిదో స్థానంలో నిలిచిన ఆమె, 2018 జకార్తా క్రీడలకు వెన్ను గాయం కారణంగా దూరమయ్యారు. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో నాలుగో స్థానంతో పతకాన్ని తృటిలో చేజార్చుకున్నారు.




ఈసారి మాత్రం రజతంతో ఆ లోటును భర్తీ చేశారు. స్నాచ్‌లో 83 కిలోలతో పోటీ ప్రారంభించిన 32 ఏళ్ల మీరాబాయి తొలి ప్రయత్నాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. రెండో ప్రయత్నంలో 85 కిలోలు, మూడో ప్రయత్నంలో 87 కిలోలను ఎత్తారు. దీంతో స్నాచ్ ముగిసే సమయానికి మూడో స్థానంలో నిలిచారు. క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోల అత్యుత్తమ లిఫ్ట్‌తో రెండో స్థానానికి దూసుకెళ్లి రజతాన్ని ఖాయం చేసుకున్నారు. మీరాబాయి రజతంతో ఆసియా క్రీడల వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ 28 ఏళ్ల పతక నిరీక్షణకు తెరపడింది. చివరిసారిగా 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో కరణం మల్లేశ్వరి రజత పతకం సాధించారు. ఆ తర్వాత ఈ విభాగంలో భారత్‌కు పతకం దక్కలేదు. ఇప్పుడు మీరాబాయి ఆ సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికారు. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్ గమ్ అసాధారణ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 121 కిలోలతో మొత్తం 215 కిలోలు ఎత్తారు. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, మొత్తం బరువు.. మూడు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పారు. ఆసియా క్రీడల్లో ఆమెకు ఇది వరుసగా మూడో స్వర్ణ పతకం. ఇండోనేషియాకు చెందిన లులుక్ దయానా త్రి విజయానా 191 కిలోల మొత్తం బరువుతో కాంస్యం సాధించారు. ఆసియా క్రీడల పతకాన్ని తన ఖాతాలో చేర్చుకున్న మీరాబాయి చాను.. తన సుదీర్ఘ కెరీర్‌లో మిగిలిపోయిన ప్రధాన లోటును ఈ రజతంతో భర్తీ చేసుకున్నారు.



# రషీద్ ఖాన్‌ను వెనక్కి నెట్టిన అబ్రార్

**దుబాయ్, సెప్టెంబరు 23 (ఉద్యమ కెరటం):** ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నంబర్ వన్ స్థానాన్ని కోల్పోగా.. పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ఎలాంటి మ్యాచ్ ఆడకుండానే అగ్రస్థానానికి చేరుకున్నాడు. 736 రేటింగ్ పాయింట్లతో అబ్రార్ నంబర్ వన్ టీ20 బౌలర్‌గా నిలిచాడు. ఇటీవల భారత్‌తో జరిగిన మూడో టీ20లో రషీద్ ఖాన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన అతడు 43 పరుగులు ఇచ్చాడు. ఈ ప్రదర్శనతో రేటింగ్ పాయింట్లు తగ్గడంతో 735 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. అబ్రార్ అహ్మద్ ఫిబ్రవరి తర్వాత అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడలేదు. అయినప్పటికీ రషీద్ పాయింట్లు తగ్గడంతో అబ్రార్‌కు అగ్రస్థానం దక్కింది. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా 700 పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ నాలుగో స్థానంలో, ఆస్ట్రేలియా బౌలర్ నాథన్ ఎల్లిస్ ఐదో స్థానంలో ఉన్నారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి అత్యుత్తమ స్థానంలో కొనసాగుతున్నాడు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన చివరి టీ20కి గాయం కారణంగా దూరమైన వరుణ్.. టాప్-5 నుంచి ఏడో స్థానానికి పడిపోయాడు. మరోవైపు ఇంగ్లండ్ ఆటగాడు జేమీ ఓవర్టన్ 47 స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ 12 స్థానాలు మెరుగుపరుచుకుని 639 రేటింగ్ పాయింట్లతో 15వ స్థానంలో నిలిచాడు.

# భారత్‌తో టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు

**క్రైస్ట్‌చర్చ్, సెప్టెంబరు 23 (ఉద్యమ కెరటం):** భారత్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఏడాదికి పైగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న ఫాస్ట్‌బౌలర్ ఆడమ్ మిల్నే తిరిగి జట్టులోకి రావడం ఈ ఎంపికలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టులోని 13 మంది ఆటగాళ్లకు ఈ సిరీస్‌లోనూ చోటు దక్కింది. అయితే స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర గాయం కారణంగా దూరమయ్యాడు. ఓ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో అతడి కుడి భుజానికి గాయమైంది. దీంతో టీ20 సిరీస్‌కు విశ్రాంతి ఇచ్చారు. వన్డే సిరీస్ నాటికి అతడు కోలుకుంటాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. టీ20 ప్రపంచకప్‌కు గాయం కారణంగా దూరమైన స్పిన్ ఆల్‌రౌండర్ మైఖేల్ బ్రేస్‌వెల్ కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. మరోవైపు భారత బ్యాటర్లను ఎదుర్కొనేందుకు న్యూజిలాండ్ బలమైన పేస్ దళాన్ని సిద్ధం చేసింది. జట్టులో ఆడమ్ మిల్నేతో పాటు లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, కైల్ జేమీసన్, జాకబ్ డఫ్ఫీ, జాక్ ఫౌల్క్స్, నాథన్ స్మిత్ ఉన్నారు. భారత్-న్యూజిలాండ్ టీ20 సిరీస్ అక్టోబరు 22న క్రైస్ట్‌చర్చ్‌లోని హగ్లీ ఓవల్‌లో తొలి మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. అనంతరం ఇరు జట్ల మధ్య వన్డే, టెస్టు సిరీస్‌లు కూడా జరగనున్నాయి. న్యూజిలాండ్ టీ20 జట్టు: మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫ్ఫీ, లాకీ ఫెర్గూసన్, జాక్ ఫౌల్క్స్, మాట్ హెన్రీ, బెవాన్ జాకబ్స్, కైల్ జేమీసన్, ఆడమ్ మిల్నే, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, టిమ్ సీఫెర్ట్, నాథన్ స్మిత్.



ఉద్యమ కెరటం UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# పెళ్లి, మాతృత్వంపై శృతి హాసన్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఉద్యమ కెరటం):** ప్రముఖ కథానాయిక శృతి హాసన్ తన వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం మరియు మాతృత్వంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, వివాహ వ్యవస్థ మరియు తల్లికావడంపై తన అభిప్రాయాలను నిష్కపటంగా వెల్లడించారు. గతంలో తన జీవితంలో ఒకసారి వివాహం వరకు వెళ్లి చివరి నిమిషంలో నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు శృతి వెల్లడించారు. జీవిత భాగస్వామి తోడు కోరుకున్నప్పటికీ, పెళ్లి అనే చట్టబద్ధమైన వ్యవస్థలో ఇమిడిపోవడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఆడంబరంగా పెళ్లిళ్లు చేసుకునే ఖర్చును అవసరంలో ఉన్నవారికి సాయం చేయడానికి ఉపయోగిస్తే ఎంతో మేలని, కేవలం కాగితాలపై సంతకాలు చేయడం కాకుండా ఇద్దరు వ్యక్తులు రోజూ ప్రేమతో కలసి ఉండటమే నిజమైన బంధమని పేర్కొన్నారు. చిన్నతనంలోనే పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) సమస్యల కారణంగా భవిష్యత్తులో సంతానప్రాప్తి కష్టమని వైద్యులు చెప్పడంతో మాతృత్వం పట్ల తనకు ఎంతో భయం ఉండేదని శృతి తెలిపారు. అయితే ఇటీవల వైద్యుల సలహాలతో ఆ భయాలు వీడి, తల్లిగా మారాలనే కోరిక పెరిగిందని వెల్లడించారు. దీనికోసం పెళ్లి చేసుకోవాల్సిన అవసరం లేదని, దత్తత ద్వారా లేదా సాంకేతిక మార్గాల ద్వారా సొంత బిడ్డకు తల్లి అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు.



# టాలీవుడ్ రీ-ఎంట్రీపై మలయాళ భామ కళ్యాణి ప్రియదర్శన్ చూపు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఉద్యమ కెరటం):** తక్కువ సినిమాలతోనే తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మలయాళ నటి కళ్యాణి ప్రియదర్శన్, సరైన కథ లభిస్తే టాలీవుడ్‌లోకి మళ్లీ రీ-ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తెగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తన సహజసిద్ధమైన నటనతో తెలుగు యూత్‌లో విశేషమైన అభిమాన గణాన్ని సంపాదించుకున్నారు.

## పరిమిత అవకాశాలు.. చెరగని ముద్ర

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన 'హలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన కళ్యాణి, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్‌తో నటించిన 'చిత్రలహరి' బాక్సాఫీస్ వద్ద విజయం సాధించగా, శర్వానంద్ సరసన చేసిన 'రణరంగం' ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. టాలీవుడ్‌లో కేవలం మూడు సినిమాలు మాత్రమే చేసినప్పటికీ, ఆమె పాత్రలకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి.

ప్రస్తుతం మలయాళంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ కథానాయిక, స్క్రిప్ట్ ప్రాధాన్యత ఉన్న మంచి పాత్ర లభిస్తే తెలుగులో మళ్లీ అలరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోషల్ మీడియాలో నిరంతరం క్రియాశీలకంగా ఉంటూ అభిమానులకు చేరువగా ఉండే కళ్యాణి, త్వరలోనే ఒక మంచి ప్రాజెక్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# సదా భావోద్వేగ వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఉద్యమ కెరటం): 'జయం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కథానాయిక సదా, తన సినీ ప్రయాణంలోని ఒడుదొడుకులు మరియు బుల్లితెర ప్రదర్శనల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, సినీ పరిశ్రమలో సరైన మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల కొన్ని అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.నితిన్ నటించిన చిత్రంలో 'రాను రాను అంటుందో చిన్నదో' పునర్నిర్మిత గీతం కోసం తనను సంప్రదించడానికి నిర్మాతలు ప్రయత్నించినట్లు తెలిసినప్పటికీ, ఆ వార్త తన వరకు రాలేదని, మధ్యలో ఆఫర్లను ఎవరు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని స్పష్టం చేశారు. 'ఢీ' నృత్య ప్రదర్శనకు వరుసగా మూడేళ్ల పాటు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన తర్వాత ఒకే రకమైన శైలి అనిపించడంతోనే విరామం తీసుకున్నానని ఆమె తెలిపారు. తమిళంలో చేసిన 'టార్చ్ లైట్' చిత్రంలో మహిళా ప్రాధాన్యత ఉన్న కథ కావడంతోనే సాహసంతో ఆ పాత్ర చేశానని, అయితే ప్రేక్షకులు దాన్ని కథగా కాకుండా తన పాత్రను ప్రశ్నించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. సినిమాలకు దూరమైనప్పటికీ ప్రేక్షకులు చూపుతున్న ఆదరణ పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# కుటుంబానికే నిషా ప్రాధాన్యత

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఉద్యమ కెరటం): సినీ పరిశ్రమలో వారసత్వంగా అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీనటులలో నిషా అగర్వాల్ ఒకరు. స్టార్ కథానాయిక కాజల్ అగర్వాల్ సోదరిగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తక్కువ సమయంలోనే తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించారు. 2010లో వరుణ్ సందేశ్ సరసన 'ఏమైంది ఈ వేళ' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'సోలో', 'సుకుమారుడు', 'డీకే బోస్' వంటి చిత్రాలలో నటించి తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కెరీర్ ఊపందుకుంటున్న సమయంలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నిషా, ఆ తర్వాత మాతృత్వానికి ప్రాధాన్యతనిస్తూ నటనకు పూర్తిస్థాయిలో స్వస్తి చెప్పారు. అక్క కాజల్ అగర్వాల్ ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, నిషా మాత్రం కుటుంబ జీవితానికే మొగ్గు చూపారు. వెండితెరకు దూరమైనప్పటికీ, సోషల్ మీడియా వేదికగా నిరంతరం అభిమానులతో ముచ్చటిస్తూ తన విశేష క్రేజ్‌ను కొనసాగిస్తున్నారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**